# దుష్టశిక్షణ



మలక్‌పేట్ నుండి మెహదీపట్నంకి సిటీబస్‌లో పోతున్నాను.

మధ్యాహ్న సమయం కాబట్టి బస్‌లో రష్ అంతగా లేదు.

నా సీటు ప్రక్క వరుసలో ఉన్న ఇద్దరు కుర్రాళ్ళు నా ముందువరుసల ఉన్న అమ్మాయిల్ని ఉద్దేశించి కామెంట్స్ చేసుకుంటున్నారు.

'అందమైన అమ్మాయిల్ని చూసి ఆనందించడంలో తప్పులేదు కానీ, మరీ ఇలా బూతులు మాట్లాడుతూ, అసహ్యంగా ప్రవర్తిస్తున్న వారిని చూస్తే- మన సమాజంలో నైతిక విలువలు ఇంతగా దిగజారిపోయాయా..?' అని బాధేసింది. కనీసం వయసులో పెద్దవాడినైన నేను వింటున్నానన్న జ్ఞానం కూడా వాళ్ళకు లేకపోయింది.

నేను నా ఆలోచనలతో ఉండగా...

నా కళ్ళముందే వాళ్ళలో ఒకతని జేబు చివరి నుంచి టికెట్స్ ఎగిరివచ్చి నా కాళ్ల దగ్గర పడ్డాయి. వాళ్ళు అది గమనించలేదు. నేను వంగి తీసుకుని వాళ్ళకు ఇద్దామని అనుకునేంతలోనే మొబైల్ స్క్వాడ్ బస్‌లోకి ప్రవేశించి టికెట్స్ చెక్ చేయసాగారు.

వెంటనే నేను ఆ టికెట్స్‌ని కిటికీలోంచి బయటకి పారేశాను.

టికెట్స్, ఫైన్ కట్టడానికి డబ్బులు లేని ఆ కుర్రాళ్ళిద్దరినీ మొబైల్ స్క్వాడ్ తమతో పాటు తీసుకొనిపోతూంటే ఆ అమ్మాయిల వైపు చూశాను.

నాకు కలిగిన తృప్తే వాళ్ళ ముఖాలలోనూ కనిపించింది...

దుష్టశిక్షణ జరిగిందన్న తృప్తి!

●

'మయూరి' వారపత్రిక ... 13 డిసెంబర్' 1991